# నమస్తే తెలంగాణ
## ఖమ్మం
5 | ఖమ్మం, సోమవారం 5 ఆగస్టు 2024 | KHAMMAM


# ప్రజాసేవ చేసేవారికే గుర్తింపు

- జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు
- అవకాశం ఉన్నంత వరకు సేవ చేయండి
- పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి (నేలకొండపల్లి), ఆగస్టు 4: ఎవరైతే ప్రజలతో కలిసి పనిచేస్తారో వారిని ఎప్పటికీ ప్రజలు గుర్తు పెట్టుకుంటారని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఎంపీటీసీలు, సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై తగిన విధంగా స్పందిస్తే ప్రజల్లో ఎప్పటికీ స్థానం ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు 5 సంవత్సరాలు చాలా బాగా పనిచేశారని గుర్తు చేశారు. అవకాశం ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేయటం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఎంపీటీసీలు, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మికి సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నంబూరి శాతం, నాయకులు పాల్గొన్నారు.


నేలకొండపల్లిలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ ధనలక్ష్మిని సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

# కార్యకర్తలే పార్టీకి అండ..

- కష్టకాలంలో క్యాడరే పార్టీకి బలం
- మనమందరం కేసీఆర్ ఆర్మీ సైన్యం
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఖమ్మంలో బీఆర్ఎస్ శ్రేణుల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మం, ఆగస్టు 4: పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడే కార్యకర్తలు అండగా నిలవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. అలాగే కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని, అందులో తాను ముందువరుసలో ఉంటానని స్పష్టం చేశారు. కార్యకర్తలే పార్టీకి బలమని, మనమందరమూ కేసీఆర్ ఆర్మీ సైన్యమని అన్నారు. గులాబీ జెండాకి ఉన్న ధైర్యం, నిజాయితి మరే పార్టీకీ లేవని స్పష్టం చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉంటూ ప్రజల సమస్యల కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. కొంతకాలంగా చికున్‌గున్యాతో బాధపడుతున్న అజయ్‌కుమార్ ఆదివారం ఖమ్మం వచ్చారు. నగరంలోని మమత ఆసుపత్రి ఆవరణలో ఉన్న తన స్వగృహంలో ఉన్న ఆయనను బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చి కలిశారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి ఆయన మాట్లాడారు. పార్టీ ఏ పిలుపు ఇచ్చినా అందుకొని ప్రజల కోసం పోరాడుదామని అన్నారు. ఉద్యమసారథి కేసీఆర్.. వీరోచితంగా పోరాడి తెలంగాణను సాధించి.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి.. అనేక ప్రజాకర్షక పథకాలు అమలుచేశారని గుర్తుచేశారు. అయితే పార్టీ అధికారంలో లేకుండా కష్టకాలంలో ఉన్నప్పుడే పార్టీకి మనం అండదండగా ఉండాలని సూచించారు. పదవుల కోసం పార్టీ మారే వాళ్లకు నిబద్ధత ఉండదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు నమ్మకం కోల్పోయారని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులపై ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా, జైళ్లలో వేసినా ధైర్యంగా ఉండాలని సూచించారు. క్యాడర్‌కు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పగడాల నాగరాజు, వీరూనాయక్, కూరాకుల నాగభూషణం, కర్నాటి కృష్ణ, కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, దాదె అమృత, పల్లా రోస్‌లీనా, డోన్వాన్ సరస్వతి, పగడాల శ్రీవిద్య, రుద్రగాని శ్రీదేవి, కన్నం వైష్ణవి, పసుమర్తి రామ్మోహన్, జ్యోతిరెడ్డి, బచ్చు విజయ్‌కుమార్, తోట రామారావు, మాటేటి నాగేశ్వరరావు, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, దనాల శ్రీకాంత్, తోట వీరభద్రం, కొత్త వెంకటేశ్వరరావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, మేకల సుగుణా రావు, నరేందర్, గుత్తా రవి, మండడపు నరసింహారావు, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత ఆనందం


ఖమ్మం జిల్లాకు సాగర్ జలాలను అందించే పాలేరు రిజర్వాయర్

ఎగువన వర్షాలతో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు భారీగా వరద వచ్చి చేరడంతో సాగర్ ఆయకట్టు కింద ఉన్న అన్నదాతల్లో ఆనందం వెల్లివిరిసింది. గురువారం నాగార్జునసాగర్‌లో వదిలిన నీరు సోమవారం తెల్లవారుజామున పాలేరుకు వచ్చిచేరింది. దీంతో ఈసారి సాగర్ ఆయకట్టుకు నీటి సమస్య ఉత్పన్నం కాదని ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులు అభిప్రాయపడుతున్నారు. కరుణించిన కృష్ణమ్మతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. గత సంవత్సరం పంటలకు నీరు లేకపోవడంతో లక్షలాది ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. ఈసారి వరద పోటెత్తడంతో ఒక్కసారిగా జలాశయాల్లోకి నీళ్లు చేరాయి. మొన్నటి వరకూ అడుగంటి కన్పించిన శ్రీశైలం, సాగర్ జలాశయాలు వారం రోజుల్లోనే నిండాయి. జలాలు పుష్కలంగా ఉండడంతో సర్వత్రా ఆనందం వ్యక్తమవుతోంది. సాగర్ ఆయకట్టు పరిధిలో అవకాశం ఉన్న 330 వరకు చెరువులను త్వరలో నింపేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.


సాగర్ ఎడమ కాలువ

- కృష్ణమ్మ కరుణతో చిగురించిన కర్షకుల ఆశలు
- ఖమ్మం జిల్లాలో 2.5 లక్షల ఎకరాల్లో వరి సాగు
- నేడు 'పాలేరు'కు చేరనున్న సాగర్ జలాలు
- నిండుగా శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యాంలు
- 'సాగర్' రాకతో 239కిపైగా చెరువులకు నీళ్లు
- నీరులేక నిరుడు నిలువునా ఎండిన పంటలు
- ఈ యేడు ఒక్కసారిగా నిండిన జలాశయాలు

కూసుమంచి, ఆగస్టు 4: ఖమ్మం జిల్లాకు సాగర్ నీటిని అందించే పాలేరు రిజర్వాయర్ కింద 17 మండలాల్లోని 2.5 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవుతుంది. ఈ సంవత్సరం వానకాలం సీజన్‌కు నీరు వస్తుందో రాదో అనే సందిగ్ధం నెలకొన్న తరుణంలో పాలేరులో ఇటీవల తాగునీటికీ కటకటగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా దారుణంగా నీటి మట్టం పడిపోయింది. ఇక జూలై మూడో వారంలో కూడా నీరులేక వెలవెలబోయిన జలాశయమే కన్పించింది. కానీ ఇప్పుడు క్రమంగా నీరు చేరుతోంది. ఎగువన ఉన్న శ్రీశైలం, సాగర్ జలాశయాలు ఇప్పటికే నిండుకుండలను తలపిస్తున్నాయి. ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో సాగర్ నుంచి సముద్రంలోని నీటిని వదలాలని అధికారులు నిర్ణయించారు. ఈక్రమంలో ఎడమ కాలువకు పూర్తిస్థాయిలో నీటిని ఇచ్చి అన్ని చెరువులు, చెక్‌డ్యాంలు, ఎత్తిపోతల పథకాలను నింపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## నేడు పాలేరుకు సాగర్ జలాలు..

సాగర్ నుంచి వదిలిన నీరు సోమవారం తెల్లవారే వరకు పాలేరు రిజర్వాయర్ నాయకన్‌గూడెం ఇన్‌ఫాల్ వద్దకు వచ్చి పాలేరులో చేరనున్నాయి. వానకాలం పంటలకు ఎలా నీరు ఇవ్వాలనే విషయంలో ఇప్పటికే ఒక అంచానాకు వచ్చిన అధికారులు.. నీరు పుష్కలంగా ఉండడంతో రెండు పంటలకూ ఈసారి ఢోకా లేదని చెబుతున్నారు. కానీ నీటిని జాగ్రత్తగా వినియోగించాలని సూచిస్తున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా గత యాసంగిలో రైతులు నీటి కోసం భగీరథ ప్రయత్నాలు చేశారు. సాగర్ జలాలు సమృద్ధిగా ఉండడంతో రైతులు సంతోషంతో ఉన్నారు. పాలేరు పాత కాలువకు శనివారం రాత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నీటిని విడుదల చేశారు. దీంతో కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లోని 20 వేల ఎకరాల్లో సాగునీరు అందనుంది. గత వానకాలం సీజన్‌లో సాగర్ ఆయకట్టులో పుష్కలంగా పంటలు సాగయ్యాయి. పాలేరు నుంచి కల్లూరు వరకు రెండో జోన్ కింద, కల్లూరు నుంచి కృష్ణా జిల్లా నూజివీడు వరకు మూడో జోన్ ఆరుతడి పంటలకు నీటిని విడుదల చేశారు.

## జిల్లాలో 239 చెరువులకు నీరు..

సాగర్ ఆయకట్టు పరిధిలో గల జిల్లాలోని 239 చెరువులను ఈసారి వానకాలంలో సాగర్ నీటిని నింపి ఆయకట్టు రైతులకు అందించనున్నారు. కూసుమంచి నుంచి కల్లూరు వరకు గతంలో సాగర్ రెండో జోన్ పరిధిలోని అన్ని చెరువులకు సాగు నీటిని అందించేందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

## రెండుమూడు రోజుల్లో ఆయకట్టుకు నీరు విడుదల..

పాలేరు కింద గల సాగర్ ఎడమ కాలువ రెండో జోన్‌కు రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయకట్టు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీతో నీటి విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## గోదావరి జలాల తరలింపుతో..
# భద్రాద్రి జిల్లాకు తీరని అన్యాయం

- సొంత నియోజకవర్గాల కోసం మంత్రుల కుట్ర
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు


మాట్లాడుతున్న రేగా కాంతారావు

సారపాక, ఆగస్టు 4 : కేసీఆర్ కలల ప్రాజెక్టు సీతారామ నుంచి గోదావరి జలాలను లింక్ కెనాల్ ద్వారా ఖమ్మంజిల్లాకు తరలించే యోచనలో మంత్రులు ఉన్నారని, ఈ ప్రయత్నాల కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి తీరని అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం 'నమస్తే తెలంగాణ'తో ఆయన మాట్లాడుతూ రూ.వేల కోట్లతో అశ్వాపురం మండ లం కుమ్మరిగూడెంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సీతారామ ప్రాజెక్టును నిర్మించిందన్నారు. ప్రస్తుత మంత్రులు మైదాన ప్రాంతాల్లోని తమ నియోజకవర్గాల రైతాంగానికి నీరందించేందుకు ప్రయత్నాలు చేస్తూ భద్రాద్రి జిల్లా రైతులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అదనంగా నిధుల కోసం రూ.600 కోట్ల వరకు ప్రతిపాదనలు పంపామని, అందులో హెడ్‌వర్క్స్ కోసం రూ.25 కోట్లు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసిందన్నారు. అంతేకాకుండా సీతమ్మసాగర్ కాలువ, ఎన్ఎస్‌పీ కాలువకు మధ్యలో లింక్ కెనాల్‌ను మంజూరు చేసిందని, దీనిని పూర్తి చేసి లక్ష ఎకరాల్లో గోదావరి నీటిని ఖమ్మంజిల్లాలోని పాలేరు, ఖమ్మం, మధిర తదితర ప్రాంతాలకు పంపాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే జరిగితే జిల్లాలోని పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో సుమారు 60 వేల ఎకరాల సాగు భూములు బీడు భూములుగా మారతాయని ఆవేదన చెందారు. పూర్తిగా ఏజెన్సీ జిల్లాగా ఉన్న ఈ ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభు త్వం ముందుచూపుతో ప్రాజెక్టును నిర్మిస్తే ఇక్కడి గోదావరి జలాలను ఖమ్మంజిల్లాలో మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న వారు వారివారి నియోజకవర్గాలకు నీటిని తరలించే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ప్రాంత రైతాంగానికి అన్యాయం జరిగితే సహించేదిలేదని, ఈ అంశంపై నేడో, రేపో ఇల్లెందులో రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపట్టనున్నట్లు రేగా స్పష్టం చేశారు.

# రుణమాఫీపై అనుమానాలు వద్దు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి(నేలకొండపల్లి), ఆగస్టు 4: రైతు రుణమాఫీ విషయంలో అనుమానాలకు తావు లేకుండా అర్హత గల ప్రతి ఒక్కరికీ మాఫీ జరిగేలా చూస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల వాగ్దానాలను నేరవేరుస్తామని, పేదలే అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. పార్టీలకు అతీతంగా జరిగే కార్యక్రమాలకు అందరి దీవెనలు కావాలని కోరారు. గువ్వలగూడెంలో రూ.20 లక్షలతో నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్‌ను ప్రారంభించారు. 10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు, చెన్నారంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.


చెన్నారంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

### నెలాఖరులోగా 3,500 ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం

రాష్ట్రంలోని ప్రతి నియోజకర్గానికి 3,500 ఇండ్ల వంతున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేస్తాన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.21 వేల కోట్లతో ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామన్నారు. గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నీటి పారుదల శాఖ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లా వైద్యాధికారి మాలతి, ఆర్డీవో గణేశ్, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరి దయాకర్ రెడ్డి, ఎంపీపీ వజ్జా రమ్య , నాయకులు శాఖమూరి రమేశ్, వెన్నెపూజల సతారాములు, నెల్లూరి భద్రయ్య, యోనిక జానికి రామయ్య, జెర్రిపోతుల అంజి పాల్గొన్నారు.

### నెల రోజుల్లోనే సీఎంఆర్‌ఎఫ్ వచ్చేలా చూస్తాం: మంత్రి

ప్రభుత్వం నుంచి వచ్చే ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోనే సంబంధిత లబ్ధిదారుడికి డబ్బులు అందేలా చూస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం రూ.84.50 లక్షల విలువ చెసే 201 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు.

# సింగరేణిలో రాత పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపు, ఎల్లుండి పరీక్షల నిర్వహణ


జీఎం పర్సనల్ సామ్యూల్ సుధాకర్


**పరీక్షల టైంటేబుల్**

| పోస్టు | పరీక్ష తేదీ | సమయం |
|---|---|---|
| అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ(ఎలక్ట్రికల్) | 6.8.24 | 8.30-10.30 |
| జేఎంఈటీ గ్రేడ్ సీ | 6.8.24 | 8.30-10.30 |
| ఎలక్ట్రికల్ ట్రైనీ కేటగిరి 1 | 6.8.24 | 12.30-2.00 |
| ఫిట్టర్ ట్రైనీ గ్రేడ్ 1 | 6.8.24 | 4.30-6.00 |
| మేనేజ్‌మెంట్ ట్రైనీ గ్రేడ్ 1 | 7.8.24 | 8.30-10.30 |
| మేనేజ్‌మెంట్ ట్రైనీ సిస్టమ్స్ | 7.8.24 | 12.30-2.30 |
| అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ | 7.8.24 | 4.30-6.00 |

కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 4: సింగరేణి సంస్థ ఈ ఏడాది మార్చిలో జారీ చేసిన 2/2024 ఉద్యోగ నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివిధ కేటగిరి పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షను ఈ నెల 6, 7 తేదీల్లో జరగనున్నాయి. మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఈఅండ్ఎం) ఈ2 గ్రేడ్ – 42 పోస్టులు, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సిస్టం) ఈ2 గ్రేడ్ – 2 పోస్టులు, అన్ ఎగ్జిక్యూటివ్ కింద జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ –100 పోస్టులు, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ(మెకానికల్) 9, అసిస్టెంట్ ట్రైనీ ఎలక్ట్రికల్–24, ఫిట్టర్ ట్రైనీ కేటగిరి 1– 47 పోస్టులు, ఎలక్ట్రికల్ ట్రైనీ కేటగిరి 1– 98 పోస్టులు కలిపి మొత్తం 34,900 మందికి హాల్‌టిక్కెట్లు జారీ చేసినట్లు జీఎం వెల్ఫేర్(ఆర్‌సీ) సామ్యూల్ సుధాకర్ తెలిపారు. మొత్తం ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 32కేంద్రాలను కేటాయించారు. కొత్తగూడెంలో 1, సత్తుపల్లిలో 1, ఖమ్మం 5, వరంగల్ 5, కరీంనగర్ 5, పెద్దపల్లి 1, సిద్దిపేట 1, హైదరాబాద్ 13 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.

# నేడు కేటీపీఎస్ పాత ప్లాంట్ కూలింగ్ టవర్ల కూల్చివేత

పాల్వంచ, ఆగస్టు 4: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి విద్యుత్ వెలుగులను అందించిన కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారం కూల్చివేత ముగింపు దశకు చేరుకుంది. ఓఅండ్ఎంలోని 8 యూనిట్లకు సంబంధించి ఎనిమిది కూలింగ్ టవర్లను ఈ నెల 5వ తేదీ సోమవారం నేలమట్టం చేయనున్నారు. పాత కర్మాగారానికి సంబంధించిన కూల్చివేత, అందులోని మెటీరియల్‌ను తీసుకునే విధంగా ముంబైకి చెందిన హెచ్‌ఆర్ కమర్షియల్ కాంట్రాక్టు కంపెనీ రూ.465 కోట్లకు టెండర్‌ను దక్కించుకొని పనులు పూర్తిచేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా అప్పటి కర్మాగారానికి సంబంధించిన మెటీరియల్ అంతా సంస్థ తీసుకెళ్లింది. అదేవిధంగా మిగిలిన 8 కూలింగ్ టవర్లను కూల్చివేయడానికి రంగం సిద్ధమైంది. వారంక్రితమే ఈ ప్రక్రియ పూర్తికావాల్సి ఉండగా అసెంబ్లీ సమావేశాలు ఉండడంతో ఎట్టకేలకు వాయిదా వేశారు. దీనివల్ల ఏమైనా ప్రమాదం ఏర్పడుతుందని భావించి అధికారులు నిలిపివేశారు. పక్కనే పవర్ లైన్‌కు ఏమైనా ఇబ్బందులు వస్తాయని సాకుగా చూపించి ఆపివేశారు. అయితే కూల్చివేతకు అవసరమైన బ్లాస్టింగ్ పరికరాలను అమర్చి సిద్ధమైన తరుణంలో జెన్కో అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కూల్చివేత సమయంలో ప్లాంట్ నుంచి విద్యుత్ సరఫరా చేసే లైన్లలో రెండుగంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, సోమవారం ఉదయం 8గంటలకు కూల్చివేత ప్రక్రియ మొదలుకానుంది. ఏ స్టేషన్‌లోని నాలుగు టవర్లు, మరో అర్ధగంటలో బీ స్టేషన్, ఆ తర్వాత సీ స్టేషన్‌లోని మిగిలిన నాలుగు టవర్లు గంట లేదా గంటన్నర వ్యవధిలోనే కూల్చివేయనున్నారు. జెన్కోకు సంబంధించిన ఎస్‌పీఎఫ్ సిబ్బంది, ఉన్నతాధికారుల పర్యవేక్షణతో పాటు ఆ పరిసరాలకు ఎవరు పోకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నారు.





కూల్చివేయనున్న కూలింగ్ టవర్లు ఇవే..

# గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడాలి

- 'పచ్చదనం- పరిశుభ్రత' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి


గుంతలను పరిశీలిస్తున్న డీపీవో చంద్రమౌళి

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 4: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగపడేలా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి అధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని పెద్దిరెడ్డిగూడెం, అన్నపురెడ్డిపల్లి పంచాయతీలలో క్షేత్రస్థాయిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడేలా చూడాలని, మురుగునీరు నిల్వలు లేకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో విరివిరిగా మొక్కలను నాటాలన్నారు. గ్రామాల్లో సోమవారం నుంచి ఈనెల 9 వరకు నిర్వహించనున్న 'పచ్చదనం– పరిశుభ్రత' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎల్‌పీవో రమణ, ఎంపీవో షబ్బా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.